లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డులు

ఏడుగురికి చెక్కులు అందజేసిన భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

రివార్డు చెక్కులు అందజేసిన ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 16: మావోయిస్టు పార్టీ నాయకుల పోకడ, సిద్ధాంతాలు నచ్చక ఇటీవల జిల్లా పోలీస్ అధికారుల ఎదుట లొంగిపోయిన ఏడుగురు మావోయిస్టులకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులను భద్రాద్రి జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు కొత్తగూడెంలోని తన కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామేడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తుమ్రేల్ గ్రామానికి చెందిన పొడియం మంగు అలియాస్ దేవేందర్‌కి రూ.4 లక్షలు, సుక్మా జిల్లా కిష్టారం ఠాణా పరిధిలోని డోకుపాడు గ్రామానికి చెందిన సొడి పొజ్జి అలియాస్ చిలుకకి రూ.4 లక్షలు, అదే గ్రామానికి చెందిన మడివి సోమిడి అలియాస్ రమ్యకి రూ.4 లక్షలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల మండలం కొరకట్పాడు గ్రామానికి చెందిన మడకం అడిమె అలియాస్ అనూషకి రూ.4 లక్షలు, అదే మండలం కిష్టారంపాడు గ్రామానికి చెందిన లక్ష్మయ్య అలియాస్ కల్లుకి రూ. లక్ష, ఆళ్లపల్లి మండలం అడవిరామారం గ్రామానికి చెందిన మడకం ఇడుమయ్య అలియాస్ మహేశ్‌కు రూ. లక్ష, ఏపీ రాష్ట్రం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గొల్లగుప్ప గ్రామానికి చెందిన కోరం సోమయ్య అలియాస్ సోమకి రూ. లక్ష రివార్డులను ఎస్పీ చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 కాలంలో లొంగిపోయిన 26 మంది సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన రివార్డు నగదును వారి పునరావాసం కోసం అందజేసినట్లు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యులకు జిల్లా పోలీస్ శాఖ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. లొంగిపోయి సాధారణ జీవితం గడపాలనుకునేవారు తమ బంధుమిత్రుల ద్వారా లేదా స్థానిక పోలీస్‌స్టేషన్ లేదా నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల వద్ద లొంగిపోవచ్చని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఆపరేషన్స్) టి.సాయిమనోహర్‌రెడ్డి, దుమ్ముగూడెం సీఐ బొడ్డు అశోక్‌కుమార్, చర్ల సీఐ ఆలెం రాజువర్మ, పీఆర్‌వో దాములూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండో రోజూ పంచతంత్ర టీం పర్యటన

పర్యాటక ప్రాంతాలను పరిశీలిస్తున్న రెయిన్ వాటర్ ప్రాజెక్టు, పంచతంత్ర టీం సభ్యులు

మణుగూరు టౌన్, డిసెంబర్ 16: కలెక్టర్ ఆదేశాల మేరకు రెండో రోజూ సోమవారం జిల్లాలో రెయిన్ వాటర్ ప్రాజెక్టు టీం, స్టూడియో పంచతంత్ర టీం విస్తృతంగా పర్యటించారు. మణుగూరు పుష్కర ఘాట్, పగిడేరు, హాట్ వాటర్ స్ప్రింగ్స్, ఓపెన్ కాస్ట్, సింగరేణి తదితర ప్రాంతాల్లో పర్యటించారు. మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి దగ్గరుండి గోదావరి పరీవాహక ప్రాంతాలను పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దే నేపథ్యంలో మణుగూరు కొండాయిగూడెం గోదావరి తీర ప్రాంతాన్ని పరిశీలించారు. మణుగూరులో సింగరేణి ఓసీతో పాటు అర్బన్ పార్కు జలపాతం, చిన్నరావిగూడెం వాచ్ టవర్‌ను సందర్శించారు. కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని బృందం సభ్యులు తెలిపారు.

పర్యాటక ప్రాంతానికి అనువుగా 'మోతేగడ్డ'

బూర్గంపహాడ్, డిసెంబర్ 16: మండల పరిధిలోని మోతేపట్టీనగర్ పవిత్ర గోదావరి నదీతీరంలో కొలువైన వీరభద్రుని ఆలయం పర్యాటక ప్రాంతానికి అనువుగా ఉందని రైన్ వాటర్ ప్రాజెక్టు ఫౌండర్ సీఈవో కల్పనా రమేష్ అన్నారు. సోమవారం కలెక్టర్ ఆదేశానుసారం జిల్లాలో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పలు ప్రదేశాలను తెలంగాణ పర్యాటకశాఖ పర్యటించి మోతేలోని శ్రీవీరభద్రుని ఆలయాన్ని పడవ ద్వారా వెళ్లి సందర్శించి ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. గోదావరి నది మధ్యలో ఉన్న ఆలయాన్ని డ్రోన్ కెమెరా ద్వారా చిత్రీకరించారు. చిత్రీకరించిన చిత్రాలను ప్రభుత్వానికి సమర్పిస్తామని ఆమె తెలిపారు. మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో సునీల్‌శర్మ, గిర్దావర్ ముత్తయ్య, కార్యదర్శులు బాలయ్య, మురళి, ఐకేపీ సీసీలు, గ్రామ పంచాయతీ ఎంపీడబ్ల్యు వెంకటనర్సయ్య, రామకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రావి సీతయ్య వర్ధంతి

దమ్మపేట, డిసెంబర్ 16: మండలంలోని ముష్టిబండ గ్రామంలో సీపీఎం నాయకుడు రావి సీతయ్య రెండవ వర్ధంతి సభ సోమవారం జరిగింది. స్మారక స్థూపం వద్ద చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ, కొలికపోగు శ్రీనివాసరావు, అరుకుట్ల రాంప్రసాద్, కొలికపోగు ప్రశాంత్, జగన్నాథం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/S Shriram Finance Ltd, **KOTHAGUDEM** Branch Rep. by its Branch Manager it is stated that **CHINTHALACHERUVU KOTESWARA RAO** S/o. Ramulu, **Aged :** 43Years, **R/o.** H.No. 20-2-21, Indira Nagar Colony, Palvoncha Town and mandal, Bhadradri Kothagudem District is creating mortgage against his property shown below as security for the proposed trade Loan. If anybody having any objection they can send the objections to me or to my client within **3** days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

SHEDULE OF THE PROPERTY

ACC sheet roofed house bearing H.No.20-2-20 (PTIN NO 1108005004) with a plinth area of 200 Sq. feet in the house site of an extent of 111.11 Sq. yards or 92.90 Sq.Meters situated with in Municipal limits at Haritha College area, Indira Nagar Colony, Palvoncha Town and Mandal, Bhadradri Kothagudem District, SRO Limits of Kothagudem, bounded by: **EAST:** House of Salma, **WEST:** House of Chithalacheruvu Chandrakala (H.No. 20-2-21), **NORTH:** House of Eswaraiah, **SOUTH :** Municipal Road.

PALIVELA GANESH BABU
Advocate, Kothagudem, Bhadradri Kothagudem Dist.,Cell:9849246278
Kothagudem Dt.:12.12.2024

ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

ములకలపల్లి, డిసెంబర్ 16: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ములకలపల్లిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలన్నారు. నాయకులు ముదిగొండ రాంబాబు, పొడియం వెంకటేశ్వర్లు, మాలోత్ రావూజ, ఊకంటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ఆటలతో ఆరోగ్యం, ఆనందం

కలెక్టర్ జితేష్ వి పాటిల్

క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న కలెక్టర్

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 16: ''ఆటలు ఆడడమనేది మన జీవితంలో భాగం కావాలి. ఎందుకంటే.. ఆటలతో శారీరక-మానసిక ఆరోగ్యం బాగుంటుంది, ఆనందం కలుగుతుంది'' అని, కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడాపోటీలను ఎస్పీ రోహిత్‌రాజుతో కలిసి సోమవారం కొత్తగూడెంలోని ప్రగతి మైదాన్‌లో ప్రారంభించారు. క్రీడాకారులు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించాలని, రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ... రోజూ వ్యాయామం చేయడంతో పాటు ఆటలు ఆడితే మనస్సు ప్రశాంతంగా, ఆరోగ్యం చక్కగా ఉంటుందని అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ నరేష్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, యువజన క్రీడల అదికారి పరంధామరెడ్డి, పీడీ కమలా రాణి తదితరులు పాల్గొన్నారు.

దర్శనీయ స్థలాల్లో కలెక్టర్ పర్యటన

దుమ్ముగూడెం, డిసెంబర్ 16 : జిల్లాలో దర్శనీయ స్థలాలను పర్యాటక ప్రాంతాలుగా గుర్తించడానికి రైన్ వాటర్ ప్రాజెక్టు బృందం, స్టూడియో పంచతంత్ర బృందంతో కలిసి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదివారం రాత్రి పరిశీలించారు. పర్యాటక రంగానికి అనువుగా ఉన్న దుమ్ముగూడెం మండలం బొజ్జిగుప్ప గ్రామంలో పర్యాటకులు దర్శించే స్థలాలను బృందం సభ్యులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా గ్రామాన్ని సందర్శించేలా ప్రత్యేకంగా రెండు స్పెషల్ బస్సులు ఏర్పాటు చేస్తామని, వీరికి బంధువుల మాదిరిగా అతిథి మర్యాదలు చేసేలా గిరిజనులకు సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. పర్యాటకులను మైమరిపించేలా అన్ని రకాల వసతి, సౌకర్యాలు కల్పించి గిరిజన మ్యూజియంను పర్యాటక స్థలంగా అభివృద్ధి చేయడానికి బృందం సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అనంతరం కలెక్టర్, బృందం సభ్యులు గిరిజనులతో కలిసి నృత్యం చేసి ట్రైడిషనల్ వంటకాలను రుచిచూశారు. కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్‌కుమార్, వెలుగు ఏపీఎం హేమంతిని, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి, ఐటీడీఏ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'ఇందిరమ్మ' ఇళ్లివ్వాలి..

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన

మూడు రంగులు వేసినా అవి కేసీఆర్ నిర్మించిన ఇళ్లే..

బీఆర్ఎస్ మండల కన్వీనర్

భద్రాచలం ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భద్రాచలం, డిసెంబర్ 16 : భద్రాచలం పట్టణంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఆకోజు సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 20 వార్డుల్లో నివసిస్తున్న పేదలు ప్రజా పాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారిలో అర్హులను గుర్తించి ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వరద బాధితులకు, కరకట్ట నిర్వాసితులకు కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లతోపాటు నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మూడు రంగులు వేసినా అవి ముమ్మాటికీ కేసీఆర్ నిర్మించిన ఇళ్లే అవుతాయని, ఈ విషయం ప్రతీ ఒక్కరికీ తెలుసన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో దామోదరరావుకు అందజేశారు. కార్యక్రమంలో మండల కో-కన్వీనర్ రేపాక పూర్ణచందర్‌రావు, సీనియర్ నాయకులు కొల్లం జయ ప్రేమ్‌కుమార్, బీఆర్ఎస్ మండల నాయకులు అంబటికర్ర కృష్ణ, గుంజా ఏడుకొండలు, గుంజా బాబు, బత్తుల నర్సింహులు, అయినాల రామకృష్ణ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాపుల సూరిబాబు, బాబి, డానియేల్, ప్రదీప్, ఇమంది నాగేశ్వరరావు, కీసర యువరాజు, శివ, చిట్టిమళ్ల అనిల్‌కుమార్, కావూరి సీతామహాలక్ష్మి, పూజల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులాయె.. నీళ్లే లేవాయె..

నీటి సరఫరా నిలిచిపోయిన వీధి

కొత్తగూడెం అర్బన్, డిసెంబర్ 16: ఒక్కసారి ఊహించుకోండి.. తినకుండా ఉండొచ్చుగానీ, నీళ్లు వాడకుండా-తాగకుండా ఒక్క రోజైనా ఉండగలమా..! ఉండలేము. ఒకవేళ, నీళ్లు అందని పరిస్థితే ఏర్పడితే..? కొత్తగూడెంలోని నాలుగో వార్డులోని పాత కొత్తగూడెం ప్రాంతంలోని కొన్ని వీధుల్లోని ప్రజలకు ఇప్పుడు ఈ సమస్య ఏర్పడింది. ఒక్క రోజు, రెండు రోజులు కాదు, ఏకంగా నెల రోజులుగా వీరు నీటి సమస్యతో నరకం అనుభవిస్తున్నారు.

పగిలిన పైప్‌లైన్..

మెయిన్ హాస్పిటల్ నుంచి పాత కొత్తగూడెం, మార్వాడి క్యాంపు, ఇందిరమ్మ కాలనీ, బైపాస్ వరకు ఇటీవల రోడ్డు వేశారు. ఆ తర్వాత వీధి దీపాల కోసం, మరో ప్రైవేట్ మొబైల్ కంపెనీ నెట్ వర్క్ లైన్ కేబుల్ కోసం గుంతలు తవ్వారు. ఇలా రోడ్డు నిర్మాణం, గుంతల తవ్వకం కారణంగా నాలుగుచోట్ల కిన్నెరసాని పైపులైన్ పగిలింది. ఇది జరిగిన కొన్ని రోజుల తర్వాత సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. అప్పటి నుంచి ఒక వీధికి మాత్రమే నీరు అందుతున్నది. కానీ, దాదాపు 60కి పైగా కుటుంబాలున్న మరో వీధికి మాత్రం ఇప్పటివరకూ నీళ్లు అందడం లేదు. అక్కడి 'మంచినీటి' బాధితులు సంబంధిత మున్సిపల్ అధికారిని కలిసి సమస్యను వివరించారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఇప్పటి వరకు స్పందన లేదు. ఈ బాధితులు ఇతర వీధుల్లోకి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. ''ఇప్పటికి నెల రోజులాయె.. నీళ్లు లేవాయె. సమస్యను అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. మేము ఇంకా ఎన్నాళ్లపాటు ఈ నరకయాతన అనుభవించాలి?'' అని, ఇక్కడి 'నీటి బాధితులు' తీవ్ర ఆవేదనతో.. ఆగ్రహంతో ప్రశ్నిస్తున్నారు.

డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలి

జూలూరుపాడు, డిసెంబర్ 16: మండలంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా ఉన్నందున స్థానిక ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డయాలసిస్ అందక అనంతారం గ్రామంలో ఇప్పటికే ఇద్దరు మృతి చెందారని ఆందోళన వ్యక్తం చేశారు.

నోట్ పుస్తకాలు అందజేత

కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 16: సుజాతనగర్ మండలంలోని నిమ్మలగూడెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను ప్రధానోపాధ్యాయుడు మద్దెల శివకుమార్ సోమవారం అందించారు. ఉపాధ్యాయులు షఫీ అహ్మద్, జానపాటి మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌లో రెండు ప్లాంట్లు నిర్మించాలి

పాల్వంచ, డిసెంబర్ 16: కేటీపీఎస్‌లో రెండు 800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్లను నిర్మించాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ స్థానిక కార్యాలయంలో ఆయన సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. గంధం మల్లికార్జున్‌రావు, మాలోత్ వీరునాయక్, హరికృష్ణ, ఈసం మురళి, రంజిత్ పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

భద్రాచలం, డిసెంబర్ 16: గోదావరి నదిలో యువకుడు మృతదేహం లభ్యమైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన కట్టా పవన్ ప్రదీప్ (21) మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు పవన్ ప్రదీప్ కోసం గాలించినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం భద్రాచలం శివారులో గోదావరి నదిలో శవమై కనిపించాడు. అక్కడ చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో మూడు రోజుల క్రితం తప్పిపోయిన ప్రదీప్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. గోదావరి వంతెనపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రం

ఇల్లెందు, డిసెంబర్ 16: లగచర్ల రైతులపై అక్రమ కేసుల నమోదును, థర్డ్ డిగ్రీ ప్రయోగాన్ని, జైలులో నిర్బంధించడాన్ని నిరసిస్తూ మంగళవారం అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రం సమర్పించనున్నట్లు బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. దీనిని పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇల్లెందు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మంగళవారం ఉదయం 11.00 గంటలకు డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలను సమర్పించాలని కోరారు.

దుప్పట్లు పంపిణీ

ఆళ్ళపల్లి, డిసెంబర్ 16: మండల పరిధిలోని మర్కోడు గ్రామంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు ఐడియం సంస్థ సభ్యులు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు తమ వంతు సహాయం చేస్తూ వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలనే ఉద్దేశంతో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ముత్తయ్య, వార్డెన్ రవీందర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందులో సీపీఎం జిల్లా మహాసభలు

ఇల్లెందు, డిసెంబర్ 16: సీపీఎం జిల్లా మహాసభలు ఈ నెల 20, 21 తేదీల్లో ఇల్లెందులో జరగనున్నాయి. వీటి సన్నాహక సమావేశం సోమవారం ఇల్లెందులో జరిగింది. ఈ మహాసభలను శ్రేణులు జయప్రదం చేయాలని రాష్ట్ర నాయకుడు ఏజే రమేష్ పిలుపునిచ్చారు. నాయకులు అబ్దుల్ నబి, ఆలేటి కిరణ్, ఖాదర్, మాదారపు వెంకటేశ్వర్లు, తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్ రావు, సుల్తాన తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

దమ్మపేట, డిసెంబర్ 16: మండలంలోని తొట్టిపంపు పంచాయతీ మల్లమ్మగుంపు గ్రామస్తుడు తాటి కన్నారావు ఇటీవల మృతిచెందారు. సోమవారం ఆయన సంస్మరణ సభకు మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరయ్యారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

సమగ్ర కుటుంబ సర్వే

అశ్వారావుపేట రూరల్, డిసెంబర్ 16: మండలంలోని వివిధ గ్రామాల్లో అధికారులు, ఉపాధ్యాయులు సోమవారం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో ప్రసాదరావు, ఎంపీవో ప్రసాద్ పర్యవేక్షించారు.

'గ్యారెంటీ'లను అమలు చేయాలి

చంద్రుగొండ, డిసెంబర్ 16: ఆరు గ్యారంటీలను అమలు చేయాలని సీపీఐ-ఎంఎల్ (న్యూడెమోక్రసీ) జిల్లా నాయకుడు ఎస్‌కె.ఉమర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. చంద్రుగొండలో సోమవారం పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరావత్ బాలు, వరికూటి వెంకట్రావ్, వెంకటేశ్వర్లు, బీములు, వెంకటేశ్వర్లు, శ్రీను పాల్గొన్నారు.

లకావత్ శ్రీను సంస్మరణ సభ

జూలూరుపాడు, డిసెంబర్ 16: సీపీఎం మండల కమిటీ సభ్యుడు లకావత్ శ్రీను ఇటీవల మృతిచెందారు. ఆయన సంస్మరణ సభ స్వగ్రామంలో సోమవారం జరిగింది. నాయకులు కాసాని అయిలయ్య, అన్నవరపు కనకయ్య, యాసా నరేష్, భూక్యా వీరభద్రం, అన్నవరపు సత్యనారాయణ, తాళ్లపల్లి కృష్ణ తదితరులు నివాళులర్పించారు.

వైకుంఠ ఏకాదశి ఉత్సవ పోస్టర్లు ఆవిష్కరణ

వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి సురేఖ, ఆలయ ఈవో రమాదేవి

భద్రాచలం, డిసెంబర్ 16: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 10వ తేదీ వరకు జరిగే వైకుంఠ ఏకాదశి మహోత్సవాల వాల్‌పోస్టర్లను హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ శ్రీధర్ చేతులమీదుగా ఆలయ ఈవో రమాదేవి, వేదపండితులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రికి ఆహ్వానపత్రికలు అందించి వేదపండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సత్కరించారు.

భద్రాద్రి రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం, డిసెంబర్ 16: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం అంతరాలయంలోని మూలవరులకు హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ.30 లక్షలతో తయారు చేయించి సమర్పించిన ముత్యాలు పొదిగిన ప్రత్యేక గొడుగులను అర్చకులు స్వామివారికి ధరింపచేశారు. అనంతరం స్వామివారి బేడా మండపంలో నిత్యకల్యాణాన్ని జరిపారు.

ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, డిసెంబర్ 16 : జిల్లాలో ఆది, సోమవారాల్లో రెండు రోజులపాటు 38 కేంద్రాల్లో నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ప్రశాంత వాతావరణంలో ముగిసింది. జిల్లాలో సోమవారం రెండు సెషన్లలో కలిపి 12,343 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. కొత్తగూడెంలోని పోస్టాఫీస్ సెంటర్‌లో గల సెయింట్ మేరీస్ హైస్కూల్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ పరిశీలించి.. అక్కడి ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వినతుల పరిష్కారంపై దృష్టి పెట్టండి

భద్రాచలం, డిసెంబర్ 16 : గిరిజనులు తమ సమస్యలపై సమర్పించిన వినతులపై దృష్టి సారించాలని ఐటీడీఏ ఏపీవో డేవిడ్‌రాజ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భద్రాచలం ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఏపీవో గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించారు. మిగిలిన వినతులను సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఏపీవో మాట్లాడుతూ పలు సమస్యలపై గిరిజనులు వినతులు సమర్పించారని, వాటిని ఆన్‌లైన్ చేయడంతోపాటు ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేస్తామని తెలిపారు. ఎస్‌డీసీ రవీంద్రనాథ్, ట్రైబల్ ఈఈ తానాజీ, ఆర్‌సీవో గురుకులం నాగార్జునరావు, ఏపీవో పవర్ ఏఈ మునీర్‌పాషా, ఉదయ్‌కుమార్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మళ్లీ ములుగు అడవుల్లోకి పులి

మణుగూరు ఎఫ్‌డీవో సయ్యద్ మోహిద్దీన్

మణుగూరు టౌన్, డిసెంబర్ 16 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రత్నగిరి టైగర్ జోన్ నుంచి పెద్దపులి బయలుదేరి భద్రాద్రి జిల్లా సరిహద్దు నుంచి మళ్లీ ములుగు జిల్లా సరిహద్దులోకి ప్రవేశించినట్లు మణుగూరు ఎఫ్‌డీవో సయ్యద్ మోహిద్దీన్ తెలిపారు. మణుగూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం సంచరిస్తున్న పులిని మగ పులిగా గుర్తించామని తెలిపారు. పులి వెళ్తున్న తీరును గుర్తించి ముందస్తుగానే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రతీ గ్రామంలో పగలు, రేయి గస్తీ కాస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ప్రజలకు సూచనలు చేస్తున్నామని పేర్కొన్నారు. పెద్దపులిని కాపాడడమే తమ లక్ష్యమని, పులిని యథాస్థానానికి వెళ్లేంత వరకు రక్షణగా ఉండటమే మా ధ్యేయమన్నారు.

జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

భద్రాచలం, డిసెంబర్ 16: భద్రాచలం పట్టణంలోని సీఎం కప్-2024లో భాగంగా భద్రాచలం సిటీ జిమ్‌లో జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలను పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బోగాల శ్రీనివాసరెడ్డి, కోచ్ జీవీ కోటిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. గెలుపొందిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు.

కొత్తగూడెం ఓఎస్డీకి ఉద్యోగోన్నతి

కొత్తగూడెం క్రైం, డిసెంబర్ 16: కొత్తగూడెం తాత్కాలిక అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) టి. సాయి మనోహర్‌కు నాన్ క్యాడర్ ఎస్పీగా ఉద్యోగోన్నతి లభించింది. రాష్ట్రంలోని తొమ్మిదిమంది అదనపు ఎస్పీలకు నాన్ క్యాడర్ ఎస్పీగా ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించింది. వీరిలో సాయి మనోహర్ ఉన్నారు. ఆయన హైదరాబాద్ మాదాపూర్ ట్రాఫిక్ డీసీపీగా బదిలీ అయ్యారు.

ఉద్యోగినులకు దీపాలంకరణ పోటీలు

రామవరం, డిసెంబర్ 16: సింగరేణి డే వేడుకల్లో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్, గౌతంపూర్ సేవా సభ్యులకు, జీఎం